Sakshi                                                    Dt 02/12/16.

# మెట్రో రై..ల్

- ఉగాది లేదా జూన్- 2 నాటికి ప్రారంభం
- 2018 నాటికి పూర్తిస్థాయిలో మెట్రో ప్రాజెక్టు అందుబాటులోకి...
- మెట్రోరైల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి

రాయదుర్గం: గ్రేటర్ వాసుల కలల మెట్రో ప్రాజెక్టు తొలిదశను వచ్చే ఏడాది ఉగాది లేదా రాష్ట్ర అవతరణ దినోత్సవమైన జూన్ 2న ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు హైదరాబాద్ మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో కాంటినెంటల్ యాప్, ఈ-లైబ్రరీని ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తొలిదశలో నాగోల్ నుంచి మెట్టుగూడ (8 కి.మీ), మియాపూర్-ఎస్ఆర్‌నగర్(12 కి.మీ) ప్రారంభిస్తామన్నారు. ఈ మార్గంలో మెట్రో రైళ్లకు ట్రయల్ రన్ కూడా విజయవంతంగా పూర్తిచేసినట్లు పేర్కొన్నారు. మెట్రోరైల్, ఎల్ అండ్‌టీ సంస్థ అధికారులతో బుధవారం సీఎం కేసీఆర్ సమీక్షించి మెట్రో ప్రారంభంపై నిర్దిష్ట ఆదేశాలు ఇచ్చారని, మెట్రో రెండోదశ (ఫేజ్-2) పైనా దిశానిర్దేశం చేశారన్నారు. మొదటి ఫేజ్‌లో మూడు కారిడార్‌లలో 72 కిలోమీటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు రూ.14 వేల కోట్ల వ్యయం అవుతుందన్నారు. ఇప్పటి వరకు 75 శాతం పనులు పూర్తి చేశామని, మొత్తం 72 కిలోమీటర్లలో ఇప్పటి వరకు 61 కిలోమీటర్లు ఫౌండేషన్ పనులు పూర్తి చేశామని, 58 కిలోమీటర్లలో పిల్లర్లు, 48 కిలోమీటర్లలో వయాడక్ట్‌ను పూర్తి చేసినట్లు చెప్పారు. ఎల్బీనగర్- మియాపూర్ (29కి.మీ), నాగోల్-హైటెక్‌సిటీ(28కి.మీ) మార్గాన్ని వచ్చే ఏడాది సెప్టెంబర్, అక్టోబర్ నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. పూర్తిస్థాయిలో 72 కి.మీ మెట్రో ప్రాజెక్టును 2018 ఆగస్టు నాటికి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

### మెట్రో రెండోదశ మార్గాలివే...

రెండోదశ మెట్రో ప్రాజెక్టులో భాగంగా రాయదుర్గం నుంచి ఐటీజోన్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతం మీదుగా శంషాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం వరకు మెట్రో మార్గాన్ని పొడిగించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని ఆయన గుర్తుచేశారు. మియాపూర్- పటాన్‌చెరు, ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ మార్గాల్లో రెండో దశ మెట్రో ప్రాజెక్టును చేపట్టడం ద్వారా సిటీ శివారు ప్రాంతాలన్నింటినీ అనుసంధానిస్తామన్నారు. ప్రతి మెట్రో రైల్ స్టేషన్‌లో బైసైకిల్ స్టేషన్ అందుబాటులోకి వస్తుందని, ప్రతి స్టేషన్‌లో రైలు దిగి తాము పనిచేసే ప్రాంతాలకు సైకిల్‌పై వెళ్లేందుకు అవకాశం ఉంటుందన్నారు. కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్య రంగంలో విదేశాల్లో అనుభవం గడించి దేశానికి సేవ చేయాలనే తపనతో అంతర్జాతీయస్థాయిలో అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి పూర్తిగా డిజిటలైజేషన్‌తో ఏర్పాట్లు చేయడం కాంటినెంటల్ ఆస్పత్రి ప్రత్యేకత అన్నారు. కార్యక్రమంలో కాంటినెంటల్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి, పార్క్‌వే పాంటాయ్ ఇండియా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ హరీష్ మానియన్, ఆస్పత్రి డాక్టర్లు పాల్గొన్నారు.



కాంటినెంటల్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న మెట్రో రైల్ ఎం.డీ ఎన్వీఎస్ రెడ్డి